# విరహం

కలపర్తి సత్యం

**తన భుజంమీద పడుకొని మృదువైన వేలికొసలతో ఛాతీమీద రాపాడిస్తూ "ఏమండీ!" అని ప్రభ పిలిచినట్లు అనిపించడంతో ఉలిక్కిపడి కళ్లు తెరిచాడు చంద్రం.**

ప్రభ కనిపించలేదు, కనిపించదుకూడా! ఎలా కనిపిస్తుంది, అలిగి పుట్టింటికి వెళ్లిపోతేనూ? ఆమె లేదన్న ఊహే అతనికి భరించలేనిదిగావుంది. ఊపిరి ఆడనట్లు, గుండెను ఎవరో గుప్పిట బిగించినట్లుగా వుంది.

విసుగ్గా పక్కకు ఒత్తిగిల్లి బోర్లా పడుకున్నాడు. దిండుమీద కవరు సంపెంగ పూలవాసన వేసింది. ఆ పూలంటే ఆమెకు ఎంతో ఇష్టం. వేసవిలో అందరూ మల్లెలు పెట్టుకున్నా ఆమె మాత్రం సంపెంగపూలు పెట్టుకొంటుంది. ఇంగువ కట్టిన గుడ్డకు ఆ వాసన పోనట్లు ఆమె అలిగి వెళ్లి రెండు రోజులైనా, ఆమె తల్లో తురుముకొని ఆ దిండుమీద పడుకోవడంవల్ల కవర్‌కు అంటి ఇంకా సువాసన వెదజల్లుతోంది.

'ప్చ్!' అనుకొంటూ మళ్లీ వెల్లకిలా పడుకొన్నాడు. టైం చూశాడు. నాలుగైంది. కరెక్ట్‌గా తెల్లవారు జామున ఆ టైంకి ఆమెకు మెలకువ వస్తుంది. దాంతో అతని గుండెలపై వాలి అత న్ని నిద్దురలేపి ఎన్నో గుసగుసలు చెబుతుంది... నవ్వుతుంది... నవ్విస్తుంది. అందుకే అతనికి ఆ టైంలో మెలకువ వచ్చింది.

ఆమె లేకపోవడంతో అతనికి ఏదో కోల్పోయినట్లుగా వుంది. ఇక బెడ్రూంలో వుండలేక బయటకు వచ్చాడు. చల్లనిగాలి అతన్ని తాకుతూ వెళ్లింది. వరండాలో అటూ ఇటూ పచార్లు చేయడం ప్రారంభించాడు.

"ఏం చంద్రా! పొద్దున్నే పచార్లు చేస్తున్నావేమయ్యా?" అన్న మాటలు వినిపించడంతో ఉలిక్కిపడి అటు చూశాడు.

పక్కింటి మామ్మగారు నవ్వుతూ నిలబడివుంది. ఆమె పక్కనే ఆవిడ భర్త.

చంద్రం ఏదో చెప్పబోతుండగా "పచార్లు కాదే పిచ్చిమొహమా! కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నాడు. అమ్మాయి లేదాయే. అలవాటైన ప్రాణం. పక్కన తోడులేంది నిద్ర పోనివ్వని మనసు. తుంటరి వయస్సు. విరహం. ఏం చేస్తాడు పాపం? చంద్రా! వెళ్లి శుభ్రంగా తలారా స్నానం చెయ్. కాస్త తాపం తగ్గుతుందోయ్ విరహీ!" అన్నాడు ముసలాయన నవ్వుతూ.

"విరహీ, ఆహా! మన చంద్రం పరిస్థితికి సరిగ్గా సరిపోయే పేరుపెట్టారు మాస్టారు!" ఎదురింట్లో వుండే కాషియర్ మార్నింగ్‌వాక్‌కి బయలుదేరుతూ అన్నాడు నవ్వుతూ.

చంద్రానికి సిగ్గుగా అనిపించి ఏం మాట్లాడకుండా చటుక్కున ఇంట్లోకి వెళ్లిపోయాడు. అతనికి చాలా చిత్రంగా అనిపించింది. తమ పెళ్లయ్యి కేవలం రెండు నెలలయ్యింది. ఈ కాస్త కాలానికే ఆమె తన మనసులో స్థానమంతా ఆక్రమించేసింది. ఆమె లేకపోతే తను ఒక్క క్షణం వుండలేక పోతున్నాడెందుకని? అదేనా వివాహబంధం అంటే? ఇదేనా ప్రేమ, అనురా గం, ఆప్యాయత అంటే? ఇదేనా విరహమంటే? ఆలోచిస్తూ గడ్డం తడుముకున్నాడు. గరుగ్గా తగిలింది.

ఆమెకు గడ్డం అంటే చిరాకు. ఆమెను దగ్గరికి తీసుకొని ముద్దాడబోతే "అబ్బా! గడ్డం గుచ్చుకుంటోంది. తీసేయండి" అంది.

"అబ్బా! బద్ధకంగా వుందోయ్!" అంటే తనే గడ్డం గీసింది. ఈ సంఘటన జరిగి కచ్చితంగా మూడు రోజులయ్యింది. అది గుర్తొచ్చి అతనికి నవ్వొచ్చింది. అదిగో మళ్లీ ఆమె ఆలోచనలు!

'అమ్మో! ఈ ఇంట్లో ఇంకొక్క క్షణంవుంటే తనకు ఆమె ఆలోచనలతో పిచ్చెక్కడం ఖాయం!' అనుకుంటూ చకచకా తయారయ్యి బట్టలు వేసుకొని వాకిలి గుమ్మం దగ్గరకు వచ్చాడు.


"ఏమండీ! నా మామూలు ఇవ్వరా?" అని ప్రభ అడిగినట్లు అనిపించడంతో ఠక్కున ఆగి తలుపు పక్కన చూశాడు. ఖాళీ!

కచ్చితంగా ఆ తలుపు పక్కనే తను ఆఫీస్‌కు వెళ్లబోయే ముందు ప్రభకు ఓ తీపి ముద్దిచ్చి పుచ్చుకోడం అలవాటు.

అతను బలవంతంగా తల విదిల్చాడు. మళ్లీ బంగారు చిలకమ్మ భార్యామణి ఆలోచనలు!

అసలు తనేమంత ఘోరమైన అపరాధం చేశాడని అలిగి పుట్టింటికి వెళ్లింది? తనకు పెళ్లికి ముందు సిగిరెట్లు తాగడం అలవాటు. అది ఆమెకు ఇష్టం లేదని చెప్పింది. తను మానేశాడు. మూడ్రోజుల క్రితం ఓ ఫ్రెండ్‌కు ప్రమోషన్ వచ్చిన సందర్భంగా పార్టీ ఇచ్చాడు. పార్టీ అయ్యాక ఫ్రెండ్స్‌తో కలిసి రోడ్డుమీద నడుచుకొంటూ వస్తూ వాళ్ల బలవంతంమీద ఓ సిగిరెట్ వెలిగించాడు. కొద్దిదూరం వచ్చేసరికి రిక్షాలో పక్కింటావిడతో పేరంటానికి వెళ్లివస్తున్న ప్రభ తనను చూసింది. అంతే! అలకలు, వాదోపవాదాలు, పట్టుదలలమీద ఆమె అలిగి వెళ్లిపోయింది. ఛీ! ఛీ! వెధవ సిగిరెట్ ఎంత పనిచేసింది!

నిట్టూర్చి తలుపు తాళంవేసి రోడ్డు మీదకు వచ్చాడు. రోడ్డుమీద కనిపించిన జంటల్ని చూ సి ఉసూరుమని



నిట్టూర్చాడు. అటూ ఇటూ తిరిగి ఆఫీస్‌కు చేరుకొని ఎలాగోలా పన్నెండనిపించుకొని బయటపడ్డాడు. ఇంటి దగ్గరకు వస్తూ గేటువైపు చూశాడు. తలనిండా పూలు పెట్టుకొని, తెల్లచీర కట్టుకొని నవ్వుతూ కనిపించింది ప్రభ. అదిరిపడి కళ్లు నులుముకొని తల విదిలించి చూశాడు. పక్కింటి ముసలావిడ!

'ఇక నా వల్ల కాదు! ఈ విరహాన్ని నేను భరించలేను! లోకం నవ్వనీగాక! నవ్వి పోదురుగాక నాకేటి సిగ్గు? అమ్మలక్కలు బుగ్గలు నొక్కుకొని అంతా కల్సి 'ఇంత పెళ్లాంకూచి ఏంటమ్మా' అనుకోనీగాక! తను ప్రభ దగ్గరకు ఇమ్మీడియేట్‌గా వెళ్లాలి! క్షమాపణ అడగాలి! అవసరమైతే కాళ్లు పట్టుకొనైనా సరే, తన వెంట ఇంటికి తెచ్చుకోవాల్సిందే! కృష్ణుడంతటివాడు సత్యభామ కాళ్లు పట్టుకొన్నాడు. తప్పులేదు.'



మనస్సులోనే నిర్ణయించుకొని గబగబా షేవ్ చేసుకొని స్నానం చేసి, ప్రభకు ఇష్టమైన రోజ్ కలర్ డ్రెస్ వేసుకొని తలుపు తాళంవేసి వాకిట్లోకి వచ్చి గేటు తీస్తూ రోడ్డువైపు చూసి ఆశ్చర్యపోయాడు.

ఎదురుగా రిక్షాలోంచి దిగుతూ ప్రభ! ఆమె తలనిండా సంపెంగపూలు! తనకు ఇష్టమైన తెల్లచీర! ఇద్దరూ ఒకరినొకరు చూసుకొన్నారు. ఇద్దరిపెదవులపైనా చిరునవ్వు. కళ్లలో ఆనంద బాష్పాలు! మరుక్షణం అది రోడ్డనికానీ, అందరూ తమని చూస్తున్నారనికానీ ఆలోచించకుండా ఒకరి కౌగిలిలో ఒకరు ఒదిగిపోయారు.

"మిమ్మల్ని వదిలి వుండలేకపోయాను. ఆ విరహాన్ని భరించడం నా వల్ల కాలేదు!" గుసగుసగా అందామె.

వాళ్లిద్దరి విరహబాధ తీరినందుకు తామూ సంతోషిస్తున్నట్లు పూలమొక్కలన్నీ ఆనందంగా తలలు ఆడించాయి.

"అమ్మయ్య! ఈ విరహి విరహవేదన తీరిపోయింది!" పక్కింటి తాతగారు మామ్మగారితో చెప్పారు.

వాళ్లిద్దరూ ఒకరి నడుం చుట్టూ మరొకరు చేతులు వేసుకొని ఒకరి కళ్లలోకి ఒకరు చూసుకొంటూ అలాగే వున్నారు. ఆమె తల్లో సంపెంగలు నవ్వాయి ఆనందంగా.

కరుడుగట్టిన విరహం కరగడం ప్రారంభమైంది. ■